క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

గరుగుబిల్లి: మండలంలోని రావుపల్లి గ్రామంలో పార్వతీపురానికి చెందిన ధన్వంతరి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఎం.తిరుపతిరావు ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. బీపీ, సుగర్, వెన్నెముక, నరాలకు సంబంధించిన సమస్యలతో పాటు స్త్రీలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలను తనిఖీల ద్వారా పరిశీలించి, ఉచితంగా మందులు అందజేయడం జరుగుతుందన్నారు. గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న తహసీల్దార్ అప్పారావు

భామిని: మండలంలో ప్రతీ రెవెన్యూ సమస్యను పరిష్కరించేలా వీఆర్‌ఓలు పనిచేయాలని తహసీల్దార్ నీలాపు అప్పారావు సూచించారు. రెవెన్యూ సిబ్బందితో శనివారం సమావేశమై పలు సూచనలు చేశారు. కార్యాలయంకు వచ్చిన ప్రతీ విషయం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న బీఎల్‌ఓలు సక్రమంగా పూర్తి చేయాలన్నారు. మండల సర్వేయర్ రాజేశ్వరరావు, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

కాశీవిశ్వనాథ ఆలయంలో పూజలు


ఆలయంలో పూజలు చేస్తున్న కళావెంకటరావు, జయకృష్ణ, తదితరులు

పాలకొండ: పట్టణంలోని కాశీవిశ్వనాథ ఆలయంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శనివారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో యాగం నిర్వహించారు. వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ


అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనం

సీతంపేట: గెడ్డగూడ గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అంగన్‌వాడీ కేంద్రానికి శాశ్వత భవనం లేకపోవడంతో ప్రస్తుతం గ్రామంలోని ఓ ఇంటిలో నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.10 లక్షలకు పైగా నిధులు మంజూరు చేసింది. అయినా పనులు పూర్తి చేయకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భవన నిర్మాణం పూర్తయ్యేలా చూడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అన్నదానం


అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం శనివారం నిర్వహించారు. భక్తులు చాలామంది ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామి వారి అన్నప్రసాదం స్వీకరించారు. ఉదయం సుప్రభాతసేవ, మంగళాశాసనం తదితర పూజా కార్యక్రమాలు చేపట్టిన అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనం కల్పించారు.

నూతన భవనాలు నిర్మించాలి

పార్వతీపురం టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మండల విద్యాశాఖ అధికారి (పూర్వ ఎంఆర్‌సీలు) కార్యాలయాలన్నీ దాదాపు శిథిలావస్థకు చేరుకున్నాయని, తక్షణమే వీటి స్థానంలో నూతన భవనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంఈఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సామల సింహాచలం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు విద్యాశాఖా మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాసినట్లు శనివారం ఆయన స్థానిక విలేకరులకు తెలియజేశారు. ప్రస్తుతం పాడుబడిన భవనాల్లో విధులు నిర్వహించాల్సి వస్తోందన్నారు. వర్షాకాలంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ఆందోళనగా ఉందని చెప్పారు. ఈ విషయంలో ప్రభుత్వం దృష్టి సారించాలని కోరారు.

మహిళా రక్షణపై అవగాహన సదస్సు

సాలూరు రూరల్: స్థానిక సీతారాం కళ్యాణ మండపంలో మహిళా రక్షణపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు హాజరైన మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. మహిళల కోసం మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు ప్రత్యేక చట్టాలను తీసుకువచ్చారన్నారు. ఆయన కృషి ఫలితంగానే నేడు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు.

దుర్గమ్మా.. దయచూడమ్మా..


వీరఘట్టం: దుర్గాదేవి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


వీరఘట్టం: భక్తుల పూజలందుకుంటున్న కోటదుర్గమ్మ


వీరఘట్టం: కిమ్మిలో దుర్గాదేవి ఉత్సవ విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భవానీ భక్తులు

వీరఘట్టం: కరుణించే కోటదుర్గమ్మా.. దయచూడమ్మా.. అంటూ భక్తులు శనివారం స్థానిక కోటదుర్గమ్మ ఆలయంలో పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. అలాగే భవానీ భక్తులు ఉదయం, సాయంత్రం శరణుఘోష చేస్తూ దుర్గాదేవికి పూజలు చేశారు. కిమ్మి గ్రామంలో నాగవళి నదీ తీరంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవికి భవానీ భక్తులు పూజలు చేశారు.

అన్నపూర్ణాదేవిగా..

భామిని: మండలంలోని బత్తిలిలో కోటదుర్గమ్మ సన్నిధిలో వెలసిన దుర్గామాతాను శనివారం అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హరేరామ నామ సంకీర్తన బృందం అమ్మవారి నామ సంకీర్తనలు ఆలపించారు. భవానీ దీక్షాదారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు, దళాయివలస, పెద్దూరు, రావుపల్లి, రావివలస తదితర గ్రామాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. రోజుకో అవతారంలో దర్శనమిస్తున్న దుర్గమ్మను చూసి, తరించేందుకు భక్తులు పెద్దఎత్తున ఆలయాలు, మండపాలకు పోటెత్తుతున్నారు. శనివారం అన్నపూర్ణదేవి అవతారంలో దర్శనమిచ్చిన దుర్గతల్లిని భక్తులు దర్శించుకుని, విశేష పూజలు చేశారు. మొక్కులు చెల్లించి, దుర్గమ్మా కరుణించమ్మా అని వేడుకున్నారు. పలుచోట్ల చేపడుతున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి.


గరుగుబిల్లి: నాగూరులో దుర్గమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

మాపై కక్ష సాధింపు తగునా సారూ..

పాలకొండ రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో చేసిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమం గురించి మాట్లడుదామంటే ఏమీ లేదు. కక్ష సాధింపుల గూర్చి చర్చిద్దామంటే అనేకులు తమ సమస్యలు ఏకరువు పెడుతున్నారు. నిన్నకాక మొన్న పాలకొండ మండలం అన్నవరం ప్రభుత్వ పాఠశాలకు చెందిన వంట నిర్వాహకురాలిని ఎటువంటి కారణం లేకుండానే విధుల నుంచి నిలుపుదల చేయదలిచారు. అక్కడి సర్పంచు ఈ అంశంపై గట్టిగా పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. ఈ సమస్యను ప్రస్తుతానికి పక్కన పెడితే తాజాగా మండలంలోని తంపటాపల్లి గ్రామానికి చెందిన మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల వంట నిర్వహకురాలు ఆల్తి లక్ష్మి, వంట సహాయకురాలు మురపాక దేశాలమ్మ విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఎంపీడీఓ, మండల విద్యాశాఖ యంత్రాంగం నుంచి సూచనలు అందాయి. కొత్తవారికి ఈ పనులు అప్పగిస్తున్నట్లు పాఠశాల యాజమాన్యం తెలియజేయటంతో వారు కన్నీటి పర్యంతమయ్యారు. శనివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. దాదాపు పదేళ్లగా ఈ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నామని, నేటికి తమపై పిల్లలు, వారి తల్లితండ్రులు నుంచి ఎటువంటి అభియోగాలు లేవన్నారు. తమతోపాటు మరో మహిళ కూడా విధులు చేపడుతుండగా కేవలం రాజకీయ కక్షతో తమను మాత్రమే విధుల నుంచి తప్పించేలా చర్యలు చేపట్టారని ఆరోపించారు. తమతో చేస్తున్న మరో మహిళను కొనసాగించటం విడ్డూరమన్నారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ, ప్రస్తుత ఎంఈఓ తదితరులు తమ తొలగింపునకు సంబంధించి పాఠశాల హెచ్ఎం ఓ జిరాక్స్ కాపీని మాత్రమే అందించి విధులకు దూరం చేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ తప్పు ఏమిటో అధికారులు లిఖిత పూర్వకంగా స్పష్టం చేయాలన్నారు. ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని, రాజకీయ కక్ష సాధింపులు తగవంటూ కన్నీరు పెట్టుకున్నారు.


విలేకరుల వద్ద తమ గోడు చెప్పకుంటున్న లక్ష్మి, దేశాలమ్మ

పొటాష్ వినియోగంతో అధిక దిగుబడులు

గరుగుబిల్లి: వరి సాగులో పంట పొట్ట దశలో ఉన్నప్పుడు పొటాష్ వేసుకోవడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఆర్.విజయభారతి తెలిపారు. ఇదే విషయమై ఆమె శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఏ పంటలకైనా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులు వినియోగిస్తే లాభాలు ఉంటాయన్నారు. పొటాష్ వేయకపోతే చేను పక్వానికి వచ్చినప్పుడు పడిపోతుందని, అలాగే గింజల్లో పొల్లు శాతం కూడా ఎక్కువగా ఉంటుందని, గింజ నాణ్యత కూడా తగ్గుతుందన్నారు. పొటాష్ లోపం కారణంగా వరిపైరులో టుంగ్రో వైరస్ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తాయన్నారు. అయితే వరిచేనులో పొటాష్‌ను రెండు విడతల్లో వేసుకోవాలని సూచించారు. మొదటి విడతగా ఆఖరి దమ్ములో 15 నుంచి 20 కిలోలు, రెండో విడతగా చిరుపొట్ట దశలో 15 కిలోల పొటాష్ వేసుకోవాలన్నారు.

మానవ సేవే మాధవ సేవ

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): మానవ సేవే మాధవ సేవ అని, సేవా కార్యక్రమాల నిర్వహణకు వాయుపుత్ర సేవా సంఘం ఏర్పాటు అభినందనీయమని మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్‌దేవ్ అన్నారు. కురుపాం మండల కేంద్రంలో వాయుపుత్ర సేవా సంఘం ప్రారంభోత్సవం, సంఘ లోగో ఆవిష్కరణ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు తోచినంత పొరుగువారికి సాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించగా, పలువురు దాతలు రక్తం దానం చేశారు. ఇదిలా ఉండగా, కళింగ వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు అంధవరపు కోటేశ్వరరావు ఆ సంఘ నిధికి రూ.5 వేలను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు, సంఘ నిర్వాహకులు గెంబలి నాగరాజు, ప్రదీప్, బోటు స్వాతి, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న దాతలు

వినతిపత్రం అందజేత

కొమరాడ: ఉచిత ఇసుక విధానం వెంటనే అమలు చేసి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొల్లు సాంబమూర్తి ప్రభుత్వాన్ని కోరారు. ఇదే విషయమై ఆయన పలువురు భవన నిర్మాణ కార్మికులతో కలిసి తహసీల్దారు కార్యాలయానికి శనివారం వెళ్లి, వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భామిని నుంచి కొమరాడకు ఇసుక తీసుకురావాలంటే 250 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వస్తోందని, దగ్గరలోని నాగావళి నదిలో కావాల్సినంత ఇసుక ఉందని అనుమతి ఇస్తే ఇసుక రవాణా జరిగి, భవన నిర్మాణ కార్మికులకు పని దొరుకుతుందన్నారు. ఇసుక కొరత కారణంగా చాలాచోట్ల భవన నిర్మాణాలు నిలిచిపోయాయన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కొమరాడ మండల ఇసుక రీచ్‌ల నుంచి ఇసుక తరలించుకునేందుకు అనుమతులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.


వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నేత సాంబమూర్తి

ప్రకృతి సాగు విధానం లాభదాయకం

భామిని: ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, ఆదాయం పొందవచ్చని ఏపీసీఎన్ఎఫ్ రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందరరావు అన్నారు. మండలంలోని సులకజోడులో ప్రకృతి సాగు విధానంలో పండిస్తున్న వరిపంటను శనివారం ఆయన పరిశీలించారు. పొలం గట్లపై కంది, బంతి, చిక్కుడు, కొబ్బరి, అరటి, మునగ, వంటి పంటలను వేసుకోవడం వల్ల రైతులు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం పాలవలసలో గిరిజన రైతులు ఏటీఎం మోడల్‌లో సాగుచేస్తున్న పంటలను పరిశీలించారు. మెట్ట పంటలలో మొక్కజొన్న, కంది, చిక్కుడు, జొన్న, బెండ, కూరగాయల పంటలను అంతర పంటలుగా సాగు చేయాలని రైతులకు సూచించారు. ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని కోరారు. ఏపీసీఎన్ఎఫ్, ఎన్ఎఫ్ఏ, ఐసీఆర్‌పీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సూపర్ చెక్‌తో మరోసారి పరిశీలన


వెంగాపురంలో పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు

బలిజిపేట: పంటల వివరాలు ఈ పంటలో నమోదైనదీ, లేనిదీ 'సూపర్ చెక్' ద్వారా మరోసారి పరిశీలించవచ్చని ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు అన్నారు. సూపర్‌చెక్‌లో భాగంగా మండలంలోని వెంగాపురం, చిలకలపల్లి, అరసాడ, సుబ్బద్ర గ్రామాల్లో శనివారం పర్యటించి, పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వే నంబర్ల ఆధారంగా కొన్ని గ్రామాల్లో ర్యాండమ్‌గా పరిశీలన చేపడుతున్నట్లు చెప్పారు. జియోగ్రాఫికల్ రిఫరెన్స్ ప్రకారం ఏ సర్వే నంబర్లు కేటాయించారో తెలుసుకున్నట్లు తెలిపారు.

వీఆర్‌ఏల ప్రమోషన్లు అమలు చేయాలి

భామిని: జిల్లాలోని గ్రామ రెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏ)ల ప్రమోషన్లు తక్షణమే అమలు చేయాలని కోరుతూ జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావుకు ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా కమిటీ శనివారం వినతిపత్రం అందజేసింది. అవిభక్త శ్రీకాకుళం జిల్లా వీఆర్‌ఏల సంఘ సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరినట్లు జిల్లా సంఘ ప్రధాన కార్యదర్శి, భామిని మండల శాఖ అధ్యక్షుడు బుడుమూరు మిన్నారావు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ఎజ్జల అప్పలస్వామి, కోశాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రమోషన్లు అమలు చేయాలని కోరారు. అర్హత గల వీఆర్‌ఏలను వీఆర్‌ఓలు, రికార్డు అసిస్టెంట్లు, అటెండర్లు, వాచ్‌మెన్‌లుగా నియమించాలని కోరినట్లు తెలిపారు.


డీఆర్ఓ అప్పారావుకు సమస్యలు వివరిస్తున్న వీఆర్‌ఏల సంఘ నాయకులు

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

పార్వతీపురం టౌన్: కూటమి ప్రభుత్వం ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని సీపీఎం నాయకుడు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మైనింగ్ ఎ.డి కార్యాలయం సిబ్బందికి, స్థానిక తహసీల్దార్‌కు శనివారం వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉచిత ఇసుక అమలు చేసి అందరికీ ఉపాధి కల్పించే వరకు దశలవారీగా ఆందోళన చేస్తామన్నారు. భామిని మండలం కాట్రగడ వద్ద ఇసుక రీచ్ ఏర్పాటు చేశారని, సుదూరంలో ఉన్న ఆ ప్రాంతం నుంచి ఇసుక తీసుకురావాలంటే రవాణా చార్జీలు పెరిగిపోతున్నాయని చెప్పారు. ప్రస్తుతం ఇసుక లేక నిర్మాణాలు జరగడం లేదని, దీంతో భవన నిర్మాణ కార్మికులకు పని లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

జిల్లాలోని సువర్ణముఖి నదిలో సీతానగరం, డి శిర్లాం, బూర్జి, లక్ష్మీపురం... నాగావళి నదిలో కొమరాడ, కూనేరు రామభద్రపురం, కల్లికోట వద్ద గతంలో ఉండే ఇసుక రీచ్‌లను పునఃప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గొర్ల వెంకటరమణ, టౌన్ కమిటీ సభ్యులు బంకురు సూరిబాబు, ఎస్.కృష్ణ, కె.కోటేశ్వరరావు, భవన నిర్మాణ రంగ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన


శాస్త్రీయ నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

పాలకొండ రూరల్: కోటదుర్గమ్మ దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంకు చెందిన పలువురు చిన్నారులు, విద్యార్థులు శనివారం దేవస్థానం ప్రాంగణంలో సాంప్రదాయ భరతనాట్యం, పౌరాణిక పద్య, నాటక ప్రదర్శనతో అలరించారు. స్థానిక శివకేశ నృత్య నికేతన్ నేతృత్వంలో చిన్నారు శాస్త్రీయ నృత్య అభినయం ఆహుతులను ఆకట్టుకుంది.

సప్త ధాన్యాంకుర కషాయం తయారీపై అవగాహన

బలిజిపేట: మండలంలోని వెంగళరాయపురంలో సప్త ధాన్యాంకుర కషాయం తయారీపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీఆర్‌పీలు ఆదిలక్ష్మి, తిరుపతిరావు మాట్లాడుతూ... పెసలు, మినుములు, కందులు,నువ్వులు వంటి ఏడు రకాల ద్విదళ గింజాలను వంద గ్రాముల చొప్పున తీసుకోవాలన్నారు. వీటిని 12 గంటల పాటు నానబెట్టి, ఆ తర్వాత ఒక వస్త్రంలో మూట కట్టి మొలకలు వచ్చే వరకు ఉంచాలని తెలిపారు. మొలకలు వచ్చిన తర్వాత వాటిని బాగా రుబ్బి, వంద లీటర్ల నీటిలో ఐదు లీటర్ల గోమూత్రం కలిపిన మిశ్రంలో కలుపుకోవాలని సూచించారు. ఈ మిశ్రమాన్ని ఎకరా పొలంలో పిచికారీ చేస్తే గింజ నాణ్యత పెరుగుతుందని చెప్పారు. అలాగే తెల్ల కంకి, నల్ల కంకి, పొల్లు గింజలు రావన్నారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.


కషాయం తయారు చేయడంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

పౌష్టికాహారం అందించకపోతే చర్యలు

● కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


చినబోగిలి అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్


కాశీపేట వరిచేను వద్ద ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న కలెక్టర్, తదితరులు

సీతానగరం: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందించకపోతే సహించేది లేదని కలెక్టర్ ఎ. శ్యామ్‌ప్రసాద్ హెచ్చరించారు. మండలంలోని చినభోగిలి అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారుల హాజరుపట్టిక, పౌష్టికాహార స్టాక్ రిజిస్టర్లతో పాటు గుడ్లు, నూనె, పప్పులు, తదితర సామగ్రిని పరిశీలించారు. పిల్లల బరువు, ఎత్తులను పరిశీలించి, పూర్తిస్థాయిలో చిన్నారులు హాజరుకాకపోవడంపై ఆరా తీశారు. అనంతరం పిల్లలతో కాసేపు ముచ్చటించారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేపట్టాలని సిబ్బందికి సూచించారు. అలాగే వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఆహారం తీసుకునే ముందు చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా పిల్లలకు నేర్పించాలని తెలిపారు. గర్భిణులకు టేక్ హోమ్ రేషన్‌ను సకాలంలో అందించాలన్నారు. అనంతరం సీతానగరంలో నిర్మాణ దశలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

మండలంలోని కాశీపేటలో వ్యవసాయ సిబ్బంది చేపడుతున్న ఈక్రాప్ నమోదును కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ స్వయంగా పరిశీలించారు. ఈ క్రాప్ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం రైతులు స్వామి, భానులతో కాసేపు మాట్లాడి, వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలోని ఎక్సైజ్ స్టేషన్‌ను సందర్శించారు. పర్యటనలో ఏఓ ఎస్. అవినాష్, సంబంధిత శాఖల అధికారులు, రైతులు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోండి

పార్వతీపురం టౌన్: ప్రభుత్వ నిబంధనలు పాటించని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి. రవికుమార్ అన్నారు. ఈ మేరకు నిబంధనలకు విరుద్ధంగా శనివారం తెరిచిన విద్యా సంస్థలను మూసి వేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నియమ, నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యాసంస్థలను తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానం ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు, పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి...

సాలూరు రూరల్: ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రైవేట్ విద్యాసంస్థ ల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సి న బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.